క్లుప్తంగా

ఎల్లాజీకి సత్కారం



ఎల్లాజీని సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన వాసుపల్లి ఎల్లాజీని పార్టీ నాయకులు సత్కరించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్‌–9లోని ఓ సమావేశ మందిరంలో శనివారం ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకుడిగా, 18వ వార్డు అధ్యక్షుడిగా ఎల్లాజీ చాలాకాలం పార్టీకి సేవలు అందించారన్నారు. అందుకే జిల్లా స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్లు పేర్ల విజయచందర్, వెంకటనారాయణ, 18 వార్డు పార్టీ అధ్యక్షుడు రమణమూర్తితో పాటు పార్టీ నాయకులు సూరాడ దాసు, మరుపల్లి పరదేశి, ఉమ్మిడి కల్యాణ్, దుర్గస్వామి పాల్గొన్నారు.

వృద్ధుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



బీచ్‌లో కొట్టుకుపోతున్న చిట్టిబాబును ఒడ్డుకు చేరుస్తున్న బీచ్ లైఫ్‌గార్డ్స్

ఏయూక్యాంపస్ : ఏడు పదుల వయసులో ఆ పెద్దాయనకు ఏం కష్టమొచ్చిందో.. జీవితాన్ని వదిలి తీరని లోకాలకు వెళ్లిపోదామనుకున్నాడు..జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ సకాలంలో స్పందించి ఆ వృద్ధుడ్ని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే..నగరంలోని ఎన్‌ఏడీ ప్రాంతానికి చెందిన నున్నా చిట్టిబాబు (72) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని తనువు చాలించాలనుకున్నాడు. మత్స్యదర్శిని సమీపాన ఆర్కేబీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ ఆనంద్, ధనరాజ్, అరవింద్, పోలిరాజులు బీచ్‌లో కొట్టుకుపోతున్న ఆ వృద్ధుడ్ని కాపాడారు. అనంతరం పోలీసుల సాయంతో అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. చిట్టిబాబు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.


జామెట్రిక్ కాన్సెప్ట్స్‌పై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉమా మహేశ్వరరావు

బీచ్‌రోడ్డు: ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ప్రొఫెసర్ కేఎల్ఎన్ స్వామి రచించిన పాఠ్య పుస్తకం ''జామెట్రిక్ కాన్సెప్ట్స్ ఇన్ ఆర్డర్డ్ ఆల్జీబ్రా' ను ఓ హోటల్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆంధ్రయూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి. ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ ఈ పుస్తకం ఆల్జీబ్రాలో పరిశోధనలు చేస్తున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జీసీ రావు మాట్లాడుతూ నేటి తరం పరిశోధకులకు స్వామి ఒక రోల్ మోడల్ అని పేర్కొన్నారు. పాఠ్య పుస్తకం ఆవశ్యకతను ప్రొఫెసర్ పీడీఎస్ శ్రీనివాసు తెలియజేశారు. ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 30 మంది గణిత శాస్త్ర ఆచార్యులు హాజరయ్యారు.

బయో గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌కు ప్రతి రోజు 2 టన్నుల వ్యర్థాలు



ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌లో ప్రతి రోజు రెండు టన్నులకు పైగా కూరగాయల వ్యర్థాలు బయటపడుతున్నాయి. వాటిని ప్రతి రోజూ కాపులుప్పాడ డంపింగ్‌యార్డులో జీవీఎంసీ నిర్వహిస్తున్న బయో గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్‌కు తరలిస్తున్నారు. రైతు బజార్‌లో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పెద్ద సైజు ప్లాస్టిక్ డ్రమ్ములు 20కి పైగా ఏర్పాటు చేశారు. ఇక్కడ కూరగాయల వ్యాపారులు వ్యర్థాలను ఆయా డ్రమ్ముల్లో వేస్తున్నారు. రోజూ రెండు టన్నులకు పైగా వ్యర్థాలు వస్తున్నాయని రైతు బజార్ ఈవో కె.వరహాలు తెలిపారు.

రైతుకు వరం.. తాజాదనం

రైతు బజార్లలో కూరగాయలు పాడవకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సబ్‌జీ కూలర్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రయోగాత్మకంగా ఎంవీపీ రైతు బజార్,గోపాలపట్నం రైతు బజార్లలో శుక్రవారం ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా వ్యవసాయ, వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి షేక్ యాసిన్ ప్రారంభించారు. సబ్‌జీ కూలర్లలో భద్రపరిచిన కూరగాయల, పండ్లు మూడు, నాలుగు రోజుల వరకు తాజాగా ఉంటాయి. విద్యుత్ సౌకర్యం లేకుండా ఈ కూలర్లు పనిచేస్తాయి. దీంతో వీటిపై రైతులు, వ్యాపారులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీన్ని ఏవిధంగా వినియోగించుకోవాలి, ఎలా ఉపయోగపడుతుందో ఇక్కడ అధికారులు రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇది రైతులతో పాటు చిరువ్యాపారులకు, ఇళ్లలో కూడా వాడుకోవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఎంవీపీ రైతు బజార్‌లో సబ్‌జీ కూలర్



24 గంటలకొకసారి నీరు నింపాలి

నీరు నింపితే.. రెండు రోజుల పాటు తాజాగా..:

వ్యాపార సామర్థ్యం బట్టి 50 కిలోల నుంచి 100 కిలోల వరకూ అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు నిల్వ చేసుకోవచ్చు. పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, చేపలు తప్ప నిల్వ చేయడానికి అవకాశం ఉండదు. ప్రతి 24 గంటలకోసారి నీరు నింపితే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు కనీసం రెండు రోజుల పాటు తాజాగా ఉంటాయి.

ఆరిలోవ: హిందీలో కూరగాయలను సబ్‌జీ అని పిలుస్తారు. కూరగాయలు పాడవకుండా శీతలీకరించే పరికరం కావడంతో దీన్ని సబ్‌జీ కూలర్ అని పిలుస్తున్నారు. ఈ కూలర్‌కు కరెంట్‌తో పనిలేదు. ఎలాంటి ఖర్చు లేకుండా నిర్వహణ చేయవచ్చు. ఒకసారి దీన్ని కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చు. ఇది నీటితో పని చేస్తుంది. ఈ కూలర్‌కు నాలుగు పక్కల బాక్సులు మాదిరిగా ఉండే భాగాలకు నాలుగు రంధ్రాలు ఉంటాయి. ఆ రంధ్రాల ద్వారా 25 లీటర్ల నీటిని పోయాలి. వాటి మధ్యలో 100 కిలోల కూరగాయలు భద్రపరుచుకోవచ్చు. క్రేట్లు ద్వారా వాటిని భద్రపరచాలి. రైతు బజార్లలో రైతులు రోజూ విక్రయించగా మిగిలిన కూరగాయలు ఇందులో క్రేట్లులో వేసి భద్రపచుకోవచ్చు. నాలుగు పక్కల ఉన్న నీటి గోడల మధ్య అవి చల్లబడి తాజాగా ఉంటాయి. ఆ నీరు చుక్కలుగా బయటకు వెళ్లిపోతుంది. ప్రతి రోజు బయటకు పోయిన నీటి స్థానంలో కొత్త నీరు నింపాలి. నిత్యం అందులో 25 లీటర్ల నీరు ఉండే విధంగా చూసుకోవాలి. ఇందులో ముందురోజు భద్రపరిచిన కాయగూరలను మరుచటి రోజు బయటకు



కూలర్‌లో భద్రపరిచిన కూరగాయలు

తీసివేసిన తర్వాత మరో మూడు, నాలుగు రోజులు పాటు తాజాగా ఉంటాయని అధికారులు అంటున్నారు. కరెంట్ ద్వారా పనిచేసే ఫ్రిజ్‌లో భద్రపరిచిన కాయగూరలు బయటకు తీసిన కొంత సేపటికి వాడిపోయి మెత్తగా తయారవుతాయి. దీంతో పాటు కరెంట్ ఖర్చు అవుతుంది. సబ్‌జీ కూలర్‌కు మాత్రం విద్యుత్ సౌకర్యం అవసరంలేదు. నెల నెలా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పనీ ఉండదు. ఈ కూలర్‌ను నగరంలో ఎంవీపీ కాలనీతో పాటు గోపాలపట్నం రైతు బజార్లలో డెమో కోసం ఏర్పాటు చేశారు. వీటి పనితీరు బాగుంటే కొనుగోలు చేయడానికి రైతులు ఆసక్తి చూపే అవకాశం ఉంది.

రిఫ్రిజిరేటర్‌కి..సబ్‌జీ కూలర్‌కి తేడా ఇదే..

సాధారణంగా శీతల గిడ్డంగులు లేదా రిఫ్రిజిరేటర్‌లో పెట్టి నిల్వ చేస్తే క్లోరోఫార్మ్ కార్బన్స్ ప్రభావంతో కూరగాయలు, ఆకుకూరలు తిన్న వినియోగదారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. అంతే కాకుండా ఆ ఉత్పత్తుల్లో ఉండే పోషక విలువలు కోల్పోయి మనిషికి అందాల్సిన శక్తి అందదు. సబ్జీ కూలర్‌తో ఈ సమస్య ఉండదు.

రైతులకు 50 శాతం రాయితీ..

రైతు బజార్లలో కాయగూరలు విక్రయించే రైతులకు సబ్‌జీ కూలర్ కావాలనుకొంటే వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు 50 శాతం రాయితీ కల్పిస్తున్నారు. సాధారణంగా 100 కిలోల సామర్థ్యం గల సబ్‌జీ కూలర్ ధర రూ.50 వేలు. దీనిపై రైతులకు 50 శాతం రాయితీ సౌకర్యం కల్పించడంతో వారికి అందులో సగం ధరకే లభిస్తుంది. దీంతో రైతులకు ఇది లాభసాటిగా మారనుంది. అందుకే ఎంవీపీ రైతు బజార్‌లో కాయగూరల రైతులు దీనిపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. వారం రోజులు పాటు దీని పనితీరు పరిశీలించి బాగుంటే దాని కోసం ఆర్డర్ పెడతామని రైతులు చెబుతున్నారు.

ఇవీ ప్రత్యేకతలు

- విద్యుత్తు అవసరం లేకుండా సహజ పద్ధతిలో కూరగాయలు, పండ్లను 98 గంటలపాటు, ఆకుకూరలను 48 గంటలసేపు పాడవకుండా నిల్వ చేయవచ్చు.
- 25, 50, 100 కిలోలు నిల్వ చేయొచ్చు.
- వందకిలోల సామర్థ్యం ఉన్న కూలరులో 8 ప్లాస్టిక్ ట్రేలు పడతాయి. ఒక్కో ట్రేలో 15 కిలోల కూరగాయలు నిల్వ చేయవచ్చు
- కూలర్‌లోకి గాలి వెళ్లడానికి చుట్టూ రంధ్రాలున్నాయి. బయట నుంచి వెళ్లే చల్లగాలి రెండు లేయర్ల మధ్య ఉన్న నీటిని చల్లబరిస్తే, దాని ద్వారా కూరగాయలు చల్లదనంలో ఉంటాయి.
- వంద కిలోల కూలర్‌లో 24 గంటలకు 20 లీటర్ల నీరు నింపాలి. కూలర్ నుంచి నీరు చుక్కలుగా బయటకెళ్లడానికి పైపు అమర్చారు. ఇదంతా సహజ పద్ధతిలోనే జరుగుతుంది.
- కూలర్‌ను గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలి.

బాగుంటే కొనుగోలు చేస్తా



రైతు బజార్‌లో సబ్‌జీ కూలర్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. ఇది బాగా పనిచేస్తే గొనుగోలు చేస్తాను. రాయితీ కల్పిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పరిశీలన కోసం ఆకుకూరలు ఇందులో శుక్రవారం సాయంత్రం భద్రపరిచా. శనివారం ఉదయం వాటిని బయటకు తీశా. బయటకు తీసి కొన్ని గంటలు గడిచినా తాజాగా కనిపిస్తున్నాయి. మరికొన్ని రోజులు పరిశీలించి ఆర్డర్ పెడతా.

–సత్యనారాయణ, ఆకుకూరల రైతు, ఎంవీపీ రైతు బజార్,

రైతులకు ఉపయోగం



సబ్‌జీ కూలర్లను నగరంలో ఎంవీపీ రైతు బజార్‌తో పాటు గోపాలపట్నం రైతు బజార్‌లో కూడా శుక్రవారం అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇవి ప్రస్తుతం డెమో ఉంచి అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం వాటి పనితీరు, ఉపయోగం పరిశీలిస్తున్నాం. బాగుంటే వాటిని కొనుగోలు చేస్తామని రైతులు చెబుతున్నారు. దీనికి విద్యుత్ సౌకర్యం అవసరంలేదు. నిత్యం 25 లీటర్లు నీరు మాత్రం అందుబాటులో ఉండాలి. ఆ నీటి చల్లదనానికి లోపల ఉండే కాయగూరలు పాడవకుండా భద్రంగా ఉంటాయి. ఈ కూలర్ నుంచి బయటకు తీసిన నాలుగు రోజులు వరకు కూరగాయలు తాజాగా ఉంటాయి.

–కె.వరహాలు, ఎంవీపీ రైతు బజార్ ఈవో,

మొబైల్ ఫుడ్ కోర్టుకు నిప్పంటించిన దుండగుడు

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద ఉన్న మొబైల్ ఫుడ్ కోర్టుకు ఒక దుండగుడు నిప్పంటించాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం తెల్లవారి జామున వైఎంసీఏ వద్ద మొబైల్ ఫుడ్ కోర్టు ఓషియన్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు దుండగుడు నిప్పంటించాడు. మంటలు చెలరేగటంతో అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఫుడ్ కోర్టు యాజమాని సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ పుటేజ్ పరిశీలించారు.

జీవన శైలిలోని మార్పులే ఒత్తిడికి మూలం

విశాఖ విద్య: జీవనశైలిలోని మార్పులే ఒత్తిడికి మూలమని సాంకేతిక విద్య విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సాయి లక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రాయూనివర్సిటీ లోని సోషల్ వర్క్ విభాగంలో శనివారం 'మానవ జీవన శైలి – సోషల్ వర్కర్ పాత్ర ' అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అనేక రుగ్మతలకు జీవన శైలే ప్రధాన కారణమన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని చదువులకు అలవాటు పడాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ అబ్రహం, పుష్పలత, ఆశాకిరణ్, శ్యాం, లక్ష్మణరావు, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాజీపార్కు ఎదుట అనధికారిక బడ్డీ



శివాజీ పార్కును ఆనుకొని ఏర్పాటు చేసిన బడ్డీ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 17వ వార్డ్ శివాజీపార్కు గేటును ఆనుకొని అనధికారిక బడ్డీ ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. పార్కు గేటును ఆనుకొని పెద్ద బడ్డీని శనివారం ఏర్పాటు చేశారు. అయితే దీని కారణంగా పార్కులో రాకపోకలతో పాటు పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తుతాయంటూ స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ బడ్డీని తొలగించాలని జీవీఎంసీ అధికారులను కోరారు.

బాలబాలికల వైద్యం కోసం ప్రత్యేక వాహనం



వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట : రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బాలబాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రవేశ పెట్టిన ప్రత్యేక వాహనాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. 0–19 ఏళ్లలోపు బాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నవారిని గుర్తించి, వైద్య సేవలందించనున్నారు. ఆరోగ్య కేంద్రాల నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు తరలించే నిమిత్తం ఈ ప్రత్యేక వాహన సదుపాయం కల్పించామన్నారు. ముందుగా నిర్ణయించిన నిర్దీత సమయాల్లో ఆయా ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడ వైద్యాధికారులు నిర్ధారించిన బాలబాలికలను డీఈఏసీ సెంటర్‌కు తరలిస్తుంది. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హారిక, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డీమో) బి.నాగేశ్వర రావు, ఇ.శాంతిప్రియ, డీఈఐసీ మేనేజర్ మోహన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీలో ఇంటర్న్‌షిప్‌నకు ఏఐసీటీఈ అనుమతులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్ నందు డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం నిర్వహించేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతులను జారీ చేసిందని పార్క్ నిర్వాహకుడు రామ్మూర్తి తెలిపారు. రెండు నెలల వ్యవధితో ఈ ఇంటర్న్ షిప్‌ను విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు.

'క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్'కు ఘన సత్కారం



అధ్యక్ష,కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

ఎంవీపీకాలనీ: విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం అసోసియేషన్ అధ్యక్షుడు పొట్టి రమణ అధ్యక్షతన ఎంవీపీ కాలనీ సెక్టార్‌–4లోని శనివారం జరిగింది. ఇటీవల నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మద్ది వెంకటరమణ (పొట్టి రమణ), ప్రధాన కార్యదర్శి బొట్టా సురేష్, ఉపాధ్యక్షులు బొట్ట సురేష్‌కుమార్, కొయ్య శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి వీడీఎం గిరి, కన్వీనర్ మద్దిల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలు మద్ది శివ, ఆవాల రామకృష్ణలను సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 25 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పొట్టి రమణ, ప్రధాన కార్యదర్శి బొట్ట సురేష్‌లు మాట్లాడుతూ ఇసుకతో పాటు ఇతర సరుకుల రవాణాలో లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పోర్టు సరుకులు రవాణా విషయంలోను ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఆయా సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషిచేస్తామన్నారు. దీంతో పాటు ఆనందపురం మీదుగా ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నో ఎంట్రీ జోన్ కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఆ సమస్యను సైతం త్వరలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అసోసియేషన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

'వీసీబీ'లో పనిచేయడం గర్వంగా భావిస్తున్నా..



వీసీబీ సీఈవోగా పదవీ విరమణ చేసిన నరసింహమూర్తి సత్కరిస్తున్న ప్రముఖులు

మద్దిలపాలెం: సహకార కో ఆపరేటివ్ బ్యాంకుల్లో పనిచేయడాన్ని గౌరవంగా, గర్వంగా భావిస్తున్నానని విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్‌లో సీఈవోగా పదవీ విరమణ చేసిన పీవీ నరసింహమూర్తి అన్నారు. సీఈవోగా ఆయన పదవీ విరమణ చేసిన సందర్భంగా శనివారం మద్దిలపాలెంలో ఓ ఫంక్షన్ హాల్లో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలన్నారు. సీఈవోగా తాను సాధించిన విజయానికి బ్యాంకు పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు దిశా నిర్దేశమే కారణమన్నారు. ప్రస్తుత చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, డైరెక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో తాను సమర్థమంతమైన సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీసీబీ పూర్వ చైర్మన్ మానం ఆంజనేయులు, ప్రస్తుత చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు , డైరెక్టర్లు ఏ.జె. స్టాలిన్, జేవీ సత్యనారాయణమూర్తి, ఆదినారాయణ శాస్త్రి, ఎస్.నాగభూషణ చౌదరి, జి. జనార్దన్ రావు, ఎన్. కామరాజు, కే. ప్రసాదరావు, డి. బాబూరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామకృష్ణారావు, డిప్యూటీ సీఈవో వరలక్ష్మి, జోనల్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి దంపతులను అతిథులు సత్కరించారు.

ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం పాలకుల ధర్మం

మధురవాడ: పాలకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాభిప్రాయానికి గౌరవం ఇవ్వడమే నిజమైన ప్రజాస్వామ్యం అని, అది రామాయణంలో ఎంతో గొప్పగా వివరించారని ప్రవచన పరమేష్టి డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా 8వ రోజు ఆయన అయోధ్యకాండలో పలు ఘట్టాలను వివరించారు. సీతారామ కల్యాణం అనంతరం శ్రీరామునికి యువరాజ పట్టాభిషేకం చేద్దామనుకున్న దశరథ మహారాజు తాను రాజైనప్పటికీ ఏకపక్ష నిర్ణయం చేయకుండా ప్రజాభిప్రాయాన్ని అడిగారని తెలిపారు. అప్పుడు ప్రజలు, భూమి, రుషులు అందరూ శ్రీరాముని యువరాజును చేయమని చెప్పడం అయనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలియజేశారు. తాను ఇన్ని వేల సంవత్సరాలు పాలనచేసిన తర్వాత శ్రీరాముడినే ఎందుకు యువరాజుగా కోరుకుంటున్నారని అడిగితే ప్రజలు రాముని యొక్క గుణములను కీర్తించి, ప్రజలందరినీ తల్లిలా ప్రేమిస్తాడని, తండ్రిలా కాపాడతారని చెప్పారన్నారు. రజోగుణ సంపన్నురాలైన కైకమ్మ అసూయాపూరితమైన మంథర మాటలచే ప్రభావితమైందని, అసూయ అందరూ పరిత్యజించాల్సిన చెడ్డ అలవాటని తెలిపారు. ప్రవచనానికి అనేక మంది విద్యార్థులు హాజరయ్యారు. చాగంటి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మానసిక దర్శనాన్ని వివరించగా, సభికులు తిరుమల దర్శనం చేసుకున్న సంతృప్తిని పొందారు. ప్రవచన కార్యక్రమానికి ముందు రామయంత్రానికి పూజలు చేశారు. నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు పాల్గొన్నారు.

4న టీటీడీ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ధర్మప్రచార పరిషత్ అధికారులు

ఎంవీపీకాలనీ: హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 4వ తేదీన రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, డీపీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఈ వేడుకలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన బ్యానర్‌ను శనివారం ఎంవీపీ కాలనీలోని డీపీపీ కార్యాలయంలో డీపీపీ అధికారులు ఆవిష్కరించారు. 4వ తేదీ ఉదయం అల్లూరి సీతారామారాజు జిల్లాకు సంబంధించి పాడేరు విజ్ఞాన భారతి స్కూల్‌లోను, విశాఖ జిల్లాకు సంబంధించి మురళీనగర్, వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లోను, అనకాపల్లి జిల్లాకు సంబంధించి సబ్బవరం శ్రీసాయికృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోను ఈ వేడుకలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీపీ క్లస్టర్ సూపరింటిండెంట్ ఎం.కాంతికుమార్, ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ, పి.సత్య కుమార్, ఎంకేవీవీ సత్యనారాయణ, వీవీ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సహజ యోగాతో మానసిక సమస్యలు దూరం



నిర్మలాంజలి ఫెస్టివల్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

మద్దిలపాలెం: సహజ యోగతో మానసిక సమస్యలను అధిగమించవచ్చని సహజ యోగ మెడిటేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ కె.రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో జరిగిన నిర్మలాంజలి ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఒత్తిడితో నిండిన జీవితంలో సహజ యోగ మెడిటేషన్ మంచి రిలీఫ్ అన్నారు. కాకినాడ శ్రీరంగరాయ మెడికల్ కాలేజ్ న్యూరో సర్జన్ ప్రొఫెసర్ ఎంవి విజయ్ శేఖర్ మాట్లాడుతూ సహజ యోగ మెడిటేషన్ వల్ల మన శరీరంలో ఉన్న నాడులన్నీ ఉత్తజితమై ఆరోగ్యంగా తయారవుతాయన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సహజ యోగ మెడిటేషన్ విశాఖ జిల్లా కో ఆర్డినేటర్ డి.వి.శివరమేష్, కేజీహెచ్ ఈఎన్‌టీ ప్రొఫెసర్ బి.అన్నపూర్ణా రావు, బీజేపీ మహిళా నాయకురాలు సుహాసిని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత కళాకారులు హృదయానికి హత్తుకునేలా చేసిన పలు ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. 'స్వారంగ్' సంగీత ప్రదర్శన, 'కుండలినీ వృత్తాంతం', కథక్ ఒడిస్సీ నాట్యాల జుగల్బందీ నృత్య రూపకం, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అయిన హిందుస్థానీ గాత్ర సంగీతకారుడు కౌశిక్ ఐతల్ గీతాలు అలరించాయి.



మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న విద్యార్థి విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి

ప్రాణం తీసిన అతి వేగం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కొత్యాడ గ్రామానికి చెందిన ముమ్మాని ప్రదీప్, స్నేహితుడు లోకేష్ మూడు సంవత్సరాలుగా చిప్పాడలోని దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, కంపెనీ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. వారు శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వైజాగ్ వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి తిరిగి వస్తుండగా చిప్పాడ వద్ద ఎర్రమట్టిదిబ్బల సమీపంలో మార్లిన్‌కేఫ్ మలుపు వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి, బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. రక్త స్రావం ఎక్కువ కావడంతో అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెనుక కూర్చున్న లోకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం లోకేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతి వేగంతో రావడం వలన వాహనం అదుపు తప్పి, ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ప్రదీప్ తండ్రి రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.